

5వ వార్డు ఆర్కే 6 గుడిసెల్లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు

# కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎం చేయాలి

- **నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్**
- **5వ వార్డు, ఆర్కే-6 గుడిసెల్లో బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకుల ప్రచారం**

శ్రీరాంపూర్, అక్టోబర్ 27 : ప్రజా, రైతు పక్షపాతి కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంగా నిలబెట్టాలని నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపెల్లి ప్రభాకర్ ప్రజలను కోరారు. నస్పూర్ మున్సిపాలిటీ పరిధి 5వ వార్డు ఆర్కే-6 గుడిసెల్లో శుక్రవారం నడిపెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విజిత్‌రావు, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు సురేందర్ రెడ్డి, కౌన్సిలర్ భౌతు లక్ష్మితో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం పాటుపడుతున్నారన్నారు. విద్య, వైద్య, వ్యవసాయం అభివృద్ధికి కృషిచేస్తున్నారని చెప్పారు. తెలంగాణ వచ్చాక ఐటీ రంగంలో 3 లక్షల ఉద్యోగాలు లభించాయని చెప్పారు. మంచిర్యాల ఎమ్మెల్యేగా నడిపెల్లి దివాకర్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, కార్యదర్శి మేరుగు పవన్, ఉపాధ్యక్షుడు నౌండ్ల సంతోష్‌చారి, టీబీజీకేఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడు అన్నయ్య, ఏరియా చర్చల ప్రతినిధులు కాశీరావు, కుమారస్వామి, మాజీ జడ్పీటీసీ తిప్పని రామయ్య, కౌన్సిలర్లు బడికె లక్ష్మి, నాసర్, పూదరి కుమార్, కే విజయ్‌కుమార్, ముత్తె రాజేశం, మాజీ సర్పంచ్‌లు జక్కుల రాజేశం, గుంట జగ్గయ్య, మాజీ ఎంపీటీసీలు రాయలింగు, శ్రీనివాస్, వార్డుల అధ్యక్షులు రఫీక్‌ఖాన్, శెట్టి రమణ, సాగర్, రవిగౌడ్, ఎల్లయ్య, దగ్గుల మధు, నాయకులు ప్రశాంత్, కాటం రాజు, ప్రవీణ్, సోహెల్‌ఖాన్, పెర్క సత్తయ్య, బోనాసి స్వామి, గర్సె భీమయ్య, బానేశ్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో అసమ్మతి సెగ

- **పశ్చిమ టికెట్‌పై పంచాయితీ**
- **రెండో జాబితాలో ఆరు స్థానాలకు అభ్యర్థుల ఖరారు**
- **పెండింగ్‌లో డోర్నకల్, ఇల్లందు సీట్లు**
- **కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, బెల్లయ్య నాయక్, ఇనుగాల వెంకట్రామిరెడ్డికి మొండిచేయి**
- **వెస్ట్ నుంచి ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగేందుకు సిద్ధమవుతున్న జంగా రాఘవరెడ్డి**

వరంగల్, అక్టోబర్ 27(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అసెంబ్లీ ఎన్నికల కాంగ్రెస్ అభ్యర్థుల రెండో జాబితాపై అసమ్మతి సెగలు మొదలయ్యాయి. వరంగల్ పశ్చిమ, పరకాల, మహబూబాబాద్, వర్ధన్నపేటలో టికెట్ల పంచాయితీ తీవ్రమవుతున్నది. వరంగల్ పశ్చిమలో టికెట్ ఆశించి భంగపడిన డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి తిరుగుబాటుకు సిద్ధమయ్యారు. కార్పొరేటర్లు, అనుచరులతో చర్చించి ఇండిపెండెంట్‌గా బరిలో దిగేందుకు సిద్ధమవుతున్నాడు. వర్ధన్నపేటలోనూ అసమ్మతి తీవ్రమవుతున్నది. ఇక్కడ టికెట్ ఆశించిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నమిండ్ల శ్రీనివాస్, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య తాజా జాబితాతో అసంతృప్తికి గురయ్యారు. నియోజకవర్గంలో మెజారిటీ సంఖ్యలో ఉన్న మాదిగ వర్గానికి చెందిన తమను కాదని, నెల క్రితం పార్టీలో చేరిన మాల వర్గానికి చెందిన వారికి టికెట్ ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నాగరాజుకు సహకరించేది లేదని తేల్చి చెబుతున్నారు. మహబూబాబాద్‌లోనూ టికెట్ల పంచాయతీ రచ్చకెక్కబోతున్నది. కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్, టీపీసీసీ కీలక నేత బెల్లయ్య నాయక్ ఇక్కడ టికెట్ ఆశించారు. వీరిద్దరిని కాదని పార్టీ అధిష్టానం మురళీనాయక్‌కు టికెట్ ఇచ్చింది. దీంతో సీనియర్ నేతలు బలరాంనాయక్, బెల్లయ్యనాయక్ తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయంపై పరకాల సెగ్మెంటులోని హస్తం పార్టీ నాయకులు విస్తుపోతున్నారు. వారం క్రితం పార్టీలో చేరిన రేవూరి ప్రకాశ్‌రెడ్డికి ఇక్కడ టికెట్ ఇచ్చారు. కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయంతో పదేండ్లుగా పార్టీ కోసం కృషి చేస్తున్న ఇనుగాల వెంకట్రామిరెడ్డి తీవ్రంగా నిరాశకు గురయ్యారు. అనుచరులతో చర్చించి నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. పాలకుర్తి టికెట్ తనకే అని ఇన్నాళ్లు ప్రచారం చేసుకున్న హనుమాండ్ల ఝాన్సీకి పౌరసత్వమే లేకపోవడంతో టికెట్ సైతం దక్కలేదు. కాంగ్రెస్ రెండో జాబితాలో ఉమ్మడి జిల్లాలోని ఏడు సెగ్మెంట్లతో పాటు హుస్నాబాద్, హుజూరాబాద్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. జనగామ– కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, పాలకుర్తి– మామిడాల యశస్విని, మహబూబాబాద్– డాక్టర్ మురళీ నాయక్, పరకాల– రేవూరి ప్రకాశ్‌రెడ్డి, వరంగల్ పశ్చిమ– నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్ తూర్పు – కొండా సురేఖ, వర్ధన్నపేట– కేఆర్ నాగరాజు, హుస్నాబాద్– పొన్నం ప్రభాకర్, హుజూరాబాద్– ఒడితల ప్రణవ్ కాంగ్రెస్ తరుపున బరిలో దిగుతున్నారు.

## తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

ములుగురూరల్, అక్టోబర్27: తాళం వేసి ఉన్న ఇంటిలో దొంగలు చోరీ చేసిన ఘటన ములుగులోని సఫాయివాడలో వెలుగులోకి వచ్చింది. కాలనీకి చెందిన కోలెపాక కొమురమ్మ, ఆమె కుమారుడు రవి, కుటుంబసభ్యులతో కలిసి ఈ నెల 25వ తేదీన మంచిర్యాల లోని బంధువు ల ఇంటికి వెళ్లారు. శుక్రవారం ఇంటికి వచ్చి చూడగా తాళం పగలగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూసే సరికి బీరువాలోని 5 తులాల బంగారం, 20 తులాల వెండి, రూ.70వేల నగదు కనిపించలేదు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్ వివరించారు.

# అవగాహనతోనే ప్రమాదాలు తగ్గినయ్

- **సేఫ్టీపై కార్మికులకు మరింత వివరించాలి**
- **సేఫ్టీ కమిటీ కన్వీనర్ల సూచన**
- **సింగరేణి వ్యాప్తంగా కొనసాగుతున్న రక్షణ వారోత్సవాలు**




శ్రీరాంపూర్ : ఆర్కే-7 గనిపై సేఫ్టీ తనిఖీ అధికారుల బృందంతో ఉద్యోగులు

శ్రీరాంపూర్, అక్టోబర్ 27 : సింగరేణి యాజమాన్యం చేపట్టిన ఎస్‌వోపీ, ఎస్ఎంపీపై అవగాహన పెరగడం వల్లే కార్మికులు వ్యక్తిగత రక్షణ సూత్రాలు పాటిస్తున్నారని, తద్వార 2023లో ప్రమాదాలు తగ్గాయని సేఫ్టీ కమిటీ కన్వీనర్ లలిత్‌కుమార్ స్పష్టం చేశారు. 54వ రక్షణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీరాంపూర్ ఆర్కే-7 గనిని కార్పొరేట్ సేఫ్టీ కమిటీ అధికారుల బృందం తనిఖీ చేసింది. జీఎం సంజీవరెడ్డి ఆధ్వర్యంలో సేఫ్టీ కమిటీ కన్వీనర్ డీ లలిత్‌కుమార్, సభ్యులు బీ ఏజీఎం శ్రీనివాస్, ఎస్ఈ రామకృష్ణ, డీవైజీఎం సదానందం, జూనియర్ సర్వేయర్ అబ్దుల్ నబీ, అదనపు మేనేజర్ అమర్‌నాథ్‌రెడ్డి, ఎస్‌వోఎం కృష్ణప్రసాద్, వర్క్‌మన్ ఇన్‌స్పెక్టర్ యాస శ్రీనివాస్, బీ సురేశ్ సందర్శించారు. గనిపై కార్మికులతో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గనిపై డిపార్ట్‌మెంట్లను పరిశీలించి, గనిలోని పనిస్థలాలను తనిఖీ చేశారు. రక్షణ చర్యల అమలుపై తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సేఫ్టీ కమిటీ కన్వీనర్ మాట్లాడుతూ.. కార్మికులు తప్పని సరిగా రక్షణ సూత్రాలు పాటిస్తూ, రక్షణతో కూడిన ఉత్పత్తికి కృషి చేయాలని కోరారు. కార్మికులు దేశ బార్డర్‌లోని సైనికుల్లా ఎప్పటికప్పుడు అప్రమత్తతతో పనిచేస్తున్నారని చెప్పారు. తప్పని సరిగా సాంకేతిక పరిజానంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సేఫ్టీ పరికరాలు ఉపయోగించాలని కోరారు. బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం కే హరి నారాయణ గుప్తా, గని ఏజెంట్ రాముడు, మేనేజర్ సాయిప్రసాద్, ఈఈ రాజారవి చరణ్, గని సేఫ్టీ ఆఫీసర్ రవిశంకర్, ఈఈ ప్రవీణ్, వెంటిలేషన్ ఆఫీసర్ జగదీశ్వర్‌రావు, సీనియర్ పీవో సంతన్, గని సేఫ్టీ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### రక్షణతో సంస్థ అభివృద్ధికి పాటుపడాలి..

రామకృష్ణాపూర్, అక్టోబర్ 27 : రక్షణతో పని చేస్తూ సింగరేణి సంస్థ అభివృద్ధికి పాటు పడాలని సేఫ్టీ టీమ్ కన్వీనర్ సూర్యనారాయణ రాజు అన్నారు. రక్షణ పక్షోత్సవాల సందర్భంగా ఆర్కేపీ సీహెచ్‌పీని సందర్శించిన కమిటీ కన్వీనర్, సభ్యులు నరేంద్ర కుమార్, శ్రీనివాస్ ఎన్విరాన్‌మెంట్ సభ్యుడు ఆంజనేయ ప్రసాద్, ఏరియా రక్షణ జీఎం నాగరాజు, ఆర్కేపీ సీహెచ్‌పీ డీజీఎం బాలాజీ భగవతి, ఎస్ఈ చంద్రమౌళి, డీవైఎస్ఈ అశోక్‌రెడ్డి, సేఫ్టీ కమిటీ సభ్యులు వారిని సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ.. ప్రతీ కార్మికుడు ఇంటి నుంచి బయల్దేరే ముందే రక్షణ పాటించాలని సూచించారు. ఆర్కేపీ సీహెచ్‌పీని తనిఖీ చేసి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రక్షణ సూత్రాలు పాటించిన కార్మికులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సేఫ్టీ కమిటీ సభ్యులు శంకర్‌రావు, హరి రామకృష్ణ, వేణుగోపాల్, కోలమోహన్, కృష్ణస్వామి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.



రామకృష్ణాపూర్ : ఆర్కేపీ సీహెచ్‌పీని సందర్శిస్తున్న కమిటీ సభ్యులు

### కాసిపేట గనిపై..

కాసిపేట, అక్టోబర్ 27 : మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిపై రక్షణ పక్షోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. జాతీయ జెండా, రక్షణ జెండాతో బైక్ ర్యాలీ తీశారు. అనంతరం శాంతికి గుర్తుగా శాంతి కపోతాలను ఎగురవేశారు. ముందుగా గనిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని సూచించారు. ప్రమాదరహితంగా ఉండేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం అత్యవసర పరిస్థితుల్లో నిర్వహించే సీపీఆర్ పద్ధతిపై రెస్క్యూ సిబ్బంది సింగరేణి ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఉత్తమ ప్రతిభ చూపిన ఉద్యోగులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఏజెంట్ రాందాస్, మేనేజర్ అల్లావుద్దీన్, ఏరియా రక్షణాధికారి రవీందర్, గని రక్షణాధికారి సునీల్, ఏరియా ఇంజినీర్ రాం ప్రసాద్, తనిఖీ బృందం సభ్యులు ప్రవీణ్, విక్రం, సాయినాథ్, శ్రీనివాస్, సంక్షేమాధికారి మీర్జా గౌస్ జీషా, బన్న లక్ష్మణ్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

### ఓసీపీ-5లో..

గోదావరిఖని, అక్టోబర్ 27 : ఆర్జీ–1 ఏరియా జీడీకే–5 ఓసీపీలో రక్షణ పక్షోత్సవాలు నిర్వహించారు. కార్పొరేట్ జీఎం బీహెచ్ వెంకటేశ్వరరావు, ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, జీఎం సేఫ్టీ కే గురువయ్య హాజరై, రక్షణ జెండాను ఎగురవేశారు. ఉద్యోగులతో రక్షణ ప్రతిజ్ఞ చేయించి, ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రక్షణలో ముందుకు సాగుతూ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తేనే సంస్థకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలిపారు. చేసే పనిలో చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదానికి దారి తీస్తుందన్నారు. అనంతరం రక్షణలో అత్యుత్తమ ప్రతిభ చూపి ఉద్యోగులకు బహుమతులు ప్రదానం చేశారు. సేఫ్టీ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి, రక్షణ మెరుగుపర్చేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యల గురించి చర్చించారు. అనంతరం రక్షణ కమిటీ సభ్యులు ఓసీపీ–5 క్వారీ పని స్థలాల వద్దకు వెళ్లి, రక్షణ చర్యలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీర్ రామ్మూర్తి, సేఫ్టీ అధికారి సత్యనారాయణ, పీవో చంద్రశేఖర్, మేనేజర్ రాందాస్, అనిల్ గబాలె, రక్షణ కమిటీ సభ్యులు రమేశ్, రాంమోహన్, చంద్రశేఖర్, భాస్కరరావు, రాజ్‌కుమార్, కొంరయ్య, రవీందర్ తదితరులున్నారు.



కాసిపేట గనిపై బహుమతులు అందిస్తున్న అధికారులు



గోదావరిఖని : మాట్లాడుతున్న కార్పొరేట్ జీఎం వెంకటేశ్వరరావు

# రమణన్న గెలిస్తేనే భూపాలపల్లికి మోక్షం

**బీఆర్ఎస్ పార్టీ భూపాలపల్లి అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్ పటేల్**

కృష్ణకాలనీ, అక్టోబర్ 27: బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి గెలిస్తేనే భూపాలపల్లికి మోక్షమని పార్టీ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్ పటేల్ అన్నారు. శుక్రవారం 19వ వార్డు ఇన్‌చార్జి గుమ్మడి భాగ్యలక్ష్మి, వార్డు అధ్యక్షుడు దేవా ఆధ్వర్యంలో శుక్రవారం భూపాలపల్లి మున్సిపల్ పరిధిలోని 19వ వార్డు బీఆర్ఎస్ పార్టీ నాయకులతో సమీక్ష నిర్వహించారు. బీఆర్ఎస్ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్ పటేల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎమ్మెల్యే గండ్ర వెంటరమణారెడ్డి భూపాలపల్లి పట్టణాన్ని రూ. వేల కోట్ల నిధులు తీసుకువచ్చి అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. 19వ వార్డు ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. అవసరాలను బట్టి ఊసరవెల్లిలా పూటకో పార్టీ మారే నాయకులను ప్రజలు నమ్మవద్దన్నారు. ప్యాకేజీల కోసం ఇతర పార్టీలకు వెళ్లిన నాయకులను వార్డు ప్రజలు ప్రశ్నించాలని సూచించారు. తమ స్వలాభాల కోసం పార్టీ మారిన నాయకులతో బీఆర్ఎస్ పార్టీకి నష్టమేమీ లేదని అన్నారు. బీఆర్ఎస్ ఎల్లప్పుడూ పేద ప్రజల సంక్షేమానికి పాటు పడుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గండ్ర వెంకట రమణారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మున్సి పల్ వైస్ చైర్మన్ కొత్త హరిబాబు, జిల్లా గ్రంథా లయ సంస్థ చైర్మన్ బుర్ర రమేశ్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు సెగ్గం సిద్ధు, వార్డు నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.